



# అమెరి"కలకలం" కథలు

## – వంగూరి చిట్టెన్ రాజు



### 1

## మహా "వీరతాడు" నెంబర్ నూట పదహారు???

సుమారు మూడు నెలల క్రితం పత్రికల్లో ఒక మాంచి వార్త చూశాను. 37 ఏళ్ళ తరువాత ఆంధ్ర ప్రదేశ్ లో ప్రపంచ మహా సభలు జరుగుతున్నాయి అనీ, కుర్చీ కాపాడుకోడానికే సమయం సరిపోని సాక్షాత్తూ ముఖ్యమంత్రి గారే దానికి సారధ్యం వహిస్తారనీ, పాతిక కోట్ల రూపాయలు ముందే కేటాయించారనీ ఆ వార్తల సారాంశం. చెప్పొద్దూ, ఎగిరి గంతేశాను. వెంటనే అంతకింతైతే, ఇంతకెంతవుతుందీ అని కూడా ఆలోచించడం మొదలు పెట్టాను. ఎందుకంటే నేను అమెరికా వచ్చేశాక 1975 లో హైదరాబాదు లో జరిగిన మొదటి మహాసభలకి బడ్జెట్ కేవలం నలభై లక్షలే. అంటే, అంత మాత్రం పెట్టుబడికే పదహారు దేశాల నుంచీ, యావత్ భారత దేశం నుంచి వచ్చిన వారి సంఖ్య 5486 అయితే మరి పాతిక కోట్లకి అన్ని దేశాల నుంచి, "తెలంగాణా-రాయల సీమ-కోస్తా-ఉత్తరాంధ్రా" రాష్ట్రాల నుంచే కాకుండా దేశం నలుమూలల్నుంచీ ఎన్ని లక్షల మందో తరలి వచ్చి హాయిగా ఇంగ్లీషులో మాట్లాడుకుంటారు కదా అని నాకు ముచ్చట వేసింది. అది భరించడానికే కాబోలు పాపాల భైరవుడు ఆ తిరుపతి వెంకన్న కనుసన్నల్లోనే ఈ మహాసభలు పెట్టి ముఖ్యమంత్రి గారు మరొక సారి తన సత్తా చాటుకున్నారు.

మరి కొన్ని రోజులలో అంచెలంచెలుగా తెలిసిన వార్తల ప్రకారం ముఖ్యమంత్రి గారి తరువాత ఈ మహా సభలకి రాష్ట్ర సాంస్కృతిక శాఖామాత్యులు ప్రధాన నిర్వహకులైతే, ఆయనకి చేదోడు వాదోడుగా ముగ్గురు ఘనాపాఠీలనీ కూడా ఉన్నత స్థాయి నిర్వాహకులిగా ఎంపిక చేశారు. అమెరికాలో వచ్చే టీవీ కార్యక్రమాలూ, వార్తలూ చూస్తుంటే అసలు ఈ రోజుల్లో మన సంస్కృతి కూడా హెచ్. వన్ వీసా మీద అమెరికా పారిపోయిందా, లేక ఆంధ్ర ప్రదేశ్ లోనే ఎక్కడైనా దాక్కుందా అని నేను వెతుక్కుంటూ ఉంటే, "ఆ దాక్కున్న సంస్కృతి" కి ప్రత్యేకంగా ఒక మంత్రి గారు ఉన్నారు అని తెలిసి మహదానంద పడ్డాను. పైగా ఆ ముగ్గురు ఘనాపాఠీలూ తలొక కులం వారికీ చెందిన వారు అనీ, అందరూ ఒకే కులం వారు అయితే తన్నుకు చస్తారు కాబట్టి, బహుశా కులాల పక్షపాత నిష్పత్తి పాటిస్తూ తాము నిష్పక్షపాతంగా ఉన్నట్టు కనిపించాలి కాబట్టి ఈ ఎత్తుగడ వేశారు సుమా అనిపించి మన రాజ్యాంగాన్ని కాపాడుతున్న

ప్రభుత్వాన్ని అభినందించాలి అనుకున్నాను. తీరా చూస్తే ఆ ముగ్గురిలో ఇద్దరు నాకు బాగా తెలిసిన వారే. అందులో ఒకాయనకి నేను అమెరికాలో అప్రస్తుత ప్రసంగం చేసినప్పుడు చివాట్లు తిన్నాను. అవధానులకీ అప్రస్తుతానికీ ఉన్న అనుబంధం అదే కదా! మరొకాయన విశ్వవిద్యాలయంలో బహుశా పని చేసినప్పుడూ, ఇప్పుడూ కూడా విశ్రాంతి తీసుకుంటూ ఒకటి, రెండు సార్లు అమెరికా వచ్చారు. మూడో ఆయన నాకు ఎవరో తెలియదు. అందుకే బతికిపోయావు అంటుంది మా క్వీన్ విక్టోరియా. అందుకే ఆయన బతికి పోయాడు అంటాను నేను. నీ మొహం అంటుంది ఆవిడ. అవును అని ఒప్పేసుకుంటాను నేను. ఇక మరొకాయన ఐయేస్ ఆఫీసర్ గారు ..అంటే మంత్రులతో "ఐ ఆల్వేస్ సే యస్ టు యు, సార్" అనే ఆయన పేరు కూడా తరచూ వినబడుతూనే ఉంది మరొక ప్రధాన నిర్వాహకుడిగా. ఆయనా నాకు తెలిసినాయనే!

మా కాకినాడ హైస్కూల్ వజ్రోత్సవాలకి ఈ నెల అంటే డిశంబర్ 2012 లో ఎలాగూ వెడదాం అనుకుంటున్నాను కాబట్టి, ఆ మరుసటి వారమే ఈ మహాసభలు కాబట్టి అక్కడకి కూడా వెళ్ళి ఉద్ధరించేద్దామని మహా కుతూహలపడి పోయి విషయ సేకరణ మొదలు పెట్టాను. ఇక్కడ "విషయ సేకరణ" అంటే Fact Finding Mission అనమాట. ఇప్పటికే అమెరికాలోనూ, ఇండియాలోనూ చాల వీర తాళ్ళు వేయించుకున్నాను కాబట్టీ, ఈ నిర్వాహకులకి నేను తెలుసు కాబట్టీ, మేము కలిసిన సభలలో వారు నన్ను పొగిడారు కాబట్టీ "ఇచ్చుకో -పుచ్చుకో" పద్ధతిలో వారు నన్ను ప్రత్యేకంగా ఈ మహాసభలకి వారికి చెప్పి ఆహ్వానించుకోడానికి ఏం చెయ్యాలీ అనేదే నేను సేకరించదల్చుకున్న నిజానిజాలు అనేది మనలో మనమాట. ఎవరికైనా తెలుసో, తెలీదో నాకు తెలీదు కానీ "ఇక్కడ ఇచ్చుకో-పుచ్చుకో" అనేది అమెరికా-ఆంధ్రా ల మధ్య సాహితీవేత్తలూ, ఇతర ఉత్తుత్తి సుత్తి వేత్తల మధ్యా ఉన్న రహస్య ఒప్పందం. ఉదాహరణకి, ఒకనొక "కవి గార్దభ" గారో "కథా ప్రవీణ్" గారో మనవణ్ణి ఆడించడానికి, భార్యతో సహా అమెరికా వచ్చేడనుకోండి. ఆవిడ ఆ పిల్లలని చూసుకుంటూ బిజీగా ఉంటే, ఈయనకి ఏమీ తోచక స్వయంగా వెంటపడి, కొండొకచో బంధువుల తో చెప్పించి, ఎలాగో అలాగ ఒక సాహిత్యం మీటింగ్ పెట్టించుకుని, అమెరికాలో రావ్ డి. సుబ్బా గారి చేత సత్కరించబడతారు. అనగా వీరతాడు వేయించుకుంటారు. ఇది "పుచ్చుకో" అనే అంశం క్రింద వస్తుంది. మరి ఆ తరువాత ఆ సుబ్బా గారు ఇండియా వెడతాడు కదా గుళ్ళూ, గోపురాలూ చూడ్డానికి. అప్పుడు వీరతాడు మార్పిడి కార్యక్రమం జరుగుతుంది. రావ్ డి. సుబ్బా గారికి సభ పెట్టి, "కవి గార్ధభ" గారు, అదే వీరతాడుని రంగులు మార్చి ఆయన మెడలో వేస్తారనమాట. దీనిని "ఇచ్చుకో" అంటారు. ఈ వీరతాడు డిపార్ట్ మెంట్ లో ఎవరికీ తెలియనిది ఏమిటంటే సినిమాలో మొదటి చాన్స్ సంపాదించుకోవడం లాగా మొట్టమొదటి సారి వీరతాడు వేయించుకోవడమే చాలా కష్టం...ఆ తరువాత ఇక చూసుకోండి...ఆ వీరతాడు పిల్లలని పెట్టడం మొదలుపెడుతుంది. ఆఖరికి "వీడికి సన్మానం చెయ్యకపోతే మన జన్మ వృధా" అని సన్మానాలు చెయ్యకపోతే నిద్రపట్టని సమ్రాట్టులు ఓవర్ టైమ్ పనిచేస్తారు. దాం దుంప తెగ. ఒక్క సారి మెడలో దండ, భుజాల మీద శాలువా, చేతిలో తన పేరు చెక్కిన ముక్కా పడగానే, అది తాగుబోతు వాడి నిషా కంటే ఎక్కువ "కిక్" ఇస్తుంది కదా! "అబ్బే, నాకు సన్మానంటే అంటే భలే చిరాకు" అన్నవాడు ఖచ్చితంగా ఈ కేటగిరీ తాగుబోతే.

నా విషయ సేకరణలో తొలి ప్రయత్నంగా ఆ నలుగురి లో నాకు తెలిసిన నిర్వాహకుడు నెంబర్ వన్ గారికి ఎంతో ఆత్మీయంగా తెలుగులోనే అభినందనలు తెలుపుతూ, మహాసభలకి వచ్చే ఆసక్తి ఉంది అని నర్మగర్భితంగా సూచన ఇస్తూ ఒక ఈ మెయిల్ ఇచ్చాను. డైరెక్ట్ గా ఆహ్వానం పంపించండి అంటే నా అహం దెబ్బతినుట, ఆయనకి లోకువ అవుట, ఇంకా కొంపములిగి ఆయన తిరస్కరించుట మొదలైన అనర్ధాలు జరుగుతాయి కదా! పది రోజుల తరువాత కూడా ఆయన దగ్గర నుంచి సమాధానం రాకపోయేటప్పటికి నాకు "అవును సుమా. ఇండియా వాళ్ళకి ఈమెయిల్ పంపిస్తే అది ఒక అంతరిక్షంలో "బ్లాక్ హోల్" లాగా వెళ్ళడమే కానీ, తిరిగి రాదుగా, మన "ఇచ్చుకో-పుచ్చుకో" సిద్ధాంతం లో "ఇచ్చుకో" మాత్రమే పనిచేస్తుంది కదా" అని నాకు జ్ఞానోదయం అయింది. ఇక లాభం లేదు అనుకుని, మా క్వీన్ విక్టోరియా టెంకి జెల్లోదంతం తరువాత ....ఆవిడ ఉండగా అలాంటి ఫోన్ చేస్తే ఇంకేమన్నా ఉందా..పని మానేసి తెల్లారేదాకా వాయింపు కార్యక్రమం కొనసాగవచ్చు......అర్ధరాత్రి దాటే దాకా మెలుకువగా ఉండి ఒక రోజు ఆయనకి ఫోన్ చేశాను. యధాప్రకారం పది సార్లు పట్టు వదలని విక్రమార్కుడిలా చెయ్యగా, చెయ్యగా, చెయ్యి నొప్పి పుడుతూండగా ఫోన్ తీసి "హూ డు యు వాంట్?" అంది ఆయన మూడో కూతురు. డైరెక్ట్ గా తామే ఫోన్ తియ్యకుండా ఒబామా బాబు వలె ప్రవర్తించుట ఇండియాలో ఒకే ఒక సన్మానం చేయించుకున్న వాళ్ళకి కూడా అలవాటే. ఆ అమ్మాయికి నా ప్రవర చెప్పగానే, ఆ ఒక్క ముక్కా మాత్రమే అర్ధం అయి "ఏమో, అమెరికాట" అని ఆయనకి ఫోన్ ఇచ్చింది ఆ అమ్మాయి. ఆయన నన్ను బాగానే గుర్తుపట్టి, అందరి లాగానే "ఈ మెల్ ఇచ్చారా? అందలేదే" అని పద్యం చెప్పారు. నేను నా చెవిలో పువ్వు సరిచేసుకుని, నా ప్రగాఢ అభినందనలు చెప్పే ప్రక్రియ ద్వారా పొగిడి అవతల పారేసి, టీవీ చూస్తున్న ఆయన్ని తంటాలు పడి నా వేపు తిప్పుకుని, మహాసభల విషయమూ, అందులో పాల్గొనాలనే నా ఆసక్తి గురించీ చెప్పగానే "అవన్నీ మినిస్టర్ గారే చూసుకుంటున్నారండీ. కావాలంటే ఆయనతోటే మాట్లాడుకోండీ" అని కేవలం తను ఒక హై క్లాస్ గుమాస్తా అనే విషయాన్ని చెప్పకనే చెప్పి మళ్ళీ "మొగలి రేకుల" వేపు మళ్ళిపోయారు. చెప్పొద్దూ...నాకు పౌరుషం తన్నుకొచ్చింది. ఒళ్ళు మండిపోయింది. ఎందుకంటే ఈయన "పుచ్చుకుంటాను - చచ్చినా ఇవ్వను" సిద్ధాంతం మనిషి అని తెలిసిపోయింది. ఈ కేటగిరీ వాళ్ళందరికీ నాలుగైదు వీరతాళ్ళు పడగానే కించిత్తు గోరోజనం వస్తుంది. అమెరికా రాగానే దాన్ని లోపల దాచేసుకుని, నా చేత సన్మానములు చేయించుకొనుట, మా హ్యూస్టన్ లో అయితే నాసా అంతరిక్ష కేంద్రం, న్యూయార్క్ లో కనపడితే లిబర్టీ మాత విగ్రహం, ఇక వాషింగ్టన్ అయితే సాక్షాత్తూ ఒబామా గారి ఇల్లే చూపించేదాకా ప్రాణాలు తీస్తారు. పోనీలే మన మాతృదేశం నుంచి వచ్చారు కదా అని అన్ని తంటాలూ పడతాను. కానీ నేను ఇండియా వెళ్ళినప్పుడు పోనీ ఒక సారి పలకరిద్దాం అనుకుని ప్రయత్నం చేశానా. ఇక ఉట్టిదే..తుపాకీ దెబ్బకి పిట్టల్లాగా పారిపోయి, అప్పుడప్పుడు నేను ఎవరో కూడా తెలియనట్టు ఫోన్ లో కూడా ముక్తసరిగా మాట్లాడి భలే పోజు కొడతారు. అది చూసి నాకు నవ్వొస్తుంది. ఈ కేసు అలాంటిదే అని తెలిసిపోయింది.

అలా పౌరుషం తన్నుకొచ్చి, గుమాస్తాలతో మనకెందుకులే, ఏనుగు కుంభస్థలమే కొడదాం అనుకుని, మంత్రివర్యులు లేచి రాజకీయలలో మునిగిపోక ముందే తెల్లారగట్టే ఆయన్ని పట్టుకోవాలని అక్కడి టైమ్ పొద్దున్న ఆరు గంటలకి సదరు "ఎక్కడో దాక్కున్న సాంస్కృతిక" శాఖామాత్యుల్లని పిలిచాను. మళ్ళీ ఆరేళ్ళ పిల్లో, ఆరు పదుల తల్లి గారో ఫోన్ తీస్తుంది అనుకుంటున్న నాకు అనుకోని విధంగా ఒకాయన నా ఫోన్ ఎత్తి

"ఖూనీల్ రెడ్డీ, ఐ. యే యెస్ , పి. ఏ టు మినిస్టర్ స్పీకింగ్" అన్నాడు.

"అబ్బో, ఐ.యే.యెస్సే " అనుకున్నప్పటికీ నేను కొంచెం ఖంగారు పడి క్లారిఫికేషన్ అడిగితే ఆయన నవ్వేసి

"నెంబర్ పట్టి చూస్తే అమెరికా నుంచి కాల్ చేస్తున్నరని అని సమజ్ గయా. తెలుగు వినడం మీకు ప్రాక్టీస్ లేదోమో. నా పేరు సునీల్ రెడ్డి సార్...ఖూనీల్ రెడ్డి వేరే ఉండాడు." అని నా మీద జాలి పడ్డాడు.

అమ్మయ్య అనుకుని మంత్రి గారు ఉన్నారా అన్నాను.

"ఆయన స్నానం చేస్తున్నారు. అరగంటలో అయ్యప్పకి గంటకొట్టి కిందకొస్తారు." అని ఆయన చెప్పగానే

"ఆహా, మన దేశం ఎంత గొప్పదో కదా. ఐ.యే.యస్. వారు కూడా మంత్రి గారు స్నానమూ, మిగతా పనులూ చేసుకుంటున్నా దగ్గరే ఉండి దేశ సేవ చేస్తున్నారు. పాపం ఒబామా గారికి అలా స్నానం చేస్తున్నప్పుడు ఎవరన్నా చూశేవారున్నారో లేదో" అనుకుని మొత్తానికి తిరుపతి సభల విషయం ఆయనకి చెప్పగానే

"ఈ మహా సభలు మేము బహిష్కరిద్దామనుకుంటున్నాం సార్...మీరు రావాలనుకుంటే వెబ్ సైట్ చూసుకోండి. లేకపోతే అరగంట తర్వాత మినిస్టర్ గారితో డైరెక్ట్ గా మాట్లాడుకోండి" అని ఫోన్ నెంబర్ ఇచ్చాడు ఖూనీల్ రెడ్డి.

ఇది నిజంగా ఏనుగు కుంభస్తలం కొట్టడమే కాబట్టి, సరిగ్గా అరగంట తర్వాత మంత్రిగారికి ఫోన్ చెయ్యగానే...ప్రపంచంలో మరెక్కడా జరగని వింత జరిగింది. ఎందుకంటే ఆయనే స్వయంగా ఫోన్ ఆన్సర్ చేశాడు. మనసులోనే ఆ మంచి ఖూనీల్ రెడ్డికి ధన్యవాదాలు చెప్పుకుని, అసలు, సిసలు విషయ సేకరణ సాక్షాత్తూ మంత్రి గారి దగ్గరే మొదలుపెట్టే అవకాశం వచ్చింది కాబట్టి మళ్ళీ నా ప్రవర చెప్పుకుని

"నాకు ఒక ప్రత్యేక ఆహ్వానం పంపిస్తే మొత్తం అమెరికా సాహితీవేత్తలందరినీ కూడగట్టుకుని, మీ ప్రతినిధిగా అమెరికాలో ఈ మహాసభల ప్రచారం చేస్తాను." అని ప్రతిపాదించాను.

అప్పుడు ఆయన "నువ్వా, మా ప్రతినిధి గానా" అని అనగానే "నీకేమన్నా వెర్రా, పిచ్చా?" అనే ధ్వని నాకు స్పష్టంగా వినపడింది. "సభల ఏర్పాట్లు కాంగ్రెస్ పార్టీ మహా సభల స్థాయిలో చేస్తున్నాం సార్..." అన్నారు మంత్రి గారు.

"ఓ, కాంగ్రెస్ పార్టీ మీటింగా? ఇదేదో అఖిల పక్షం లాగా చంద్ర బాబు గారూ, కేసీఆర్ గారూ, జగన్ గారు రావడం కష్టం కాబట్టి వై.యస్. షర్మిల తమ పాద యాత్రలకి విరామం ఇచ్చి ఈ మహాసభలకి వస్తారనుకున్నానే" అని నేను అనగానే, ఆయన అర్జంటుగా నాలిక్కరిచేసుకుని,

"యస్, యస్. ఇవి  తెలుగు వారందరికీ ఇంటర్నేషనల్ ప్రెస్టీజ్ తేవడానికి అన్ని ఏర్పాట్లూ చేస్తున్నాం, డెలిగేట్స్ వివరాలన్నీ ఫలానా నిర్వాహకుడు నెంబర్ వన్ గారు చూస్తున్నారు. ఆయన్ని పిలవండి. లేకపోతే వెబ్ సైట్ చూడండి. నేను వర్కింగ్ కమిటీ మీటింగూ, తరువాత మహా సభల ప్రెస్ మీటింగ్ కీ వెళ్ళాలి " అని ఆయన ఫోన్ పెట్టేశాడు.

ఆయన చెప్పిన నిర్వాహకుడి నెంబర్ వన్ గారు నేను మాట్లాడిన మహానుభావుడే కాబట్టి, నేను గాలి తీసేసిన బెలూన్ అయిపోయాను. "అవును సుమా, తెలుగు సంస్కృతి మీద, కళల మీద అభిమానం ఉన్నవాళ్ళు కూడా వోట్ బేంక్ కదా. ఈ తతంగం అందుకేనేమో"...అని కూడా ఆయన మాటలని బట్టి అని కూడా నాకు అనిపించింది.

ఇక లాభం లేదూ, మనం కూడా గ్లోబలైజ్ అయిపోదాం అని వెనువెంటనే వారి వెబ్ సైట్ చూశాను. రెండు సార్లు కళ్ళు తిరిగాయి. అందులో తెలుగు జాతి చరిత్ర, మహా సభల చరిత్ర, చదివి అంత మంచి తెలుగు వ్రాసే వారు ఇంకా ఉన్నారా అనేది మొదటి కారణమైతే, కేవలం మూడు రోజులలో వారు సాధించదల్చుకున్న ఆశయాలు చదివి కల్లు తిరిగి...సారీ కళ్ళు తిరిగి...ఇంచుమించు మూర్ఛ పోయాను. నమ్మండి, నమ్మకపొండి, ఘనత వహించిన మన ప్రభుత్వం వారు ఈ మూడు రోజులలోనూ సాధించదల్చుకున్న అంశాలలో భావి తరానికి మన సంస్కృతిని అందించే ప్రణాళికలు వెయ్యడం, మన భాషా, సాహిత్యాల సమస్యలకి పరిష్కారం కనుక్కోడం, ఇంటర్నెట్ లో తెలుగుని ఉద్ధరించేసి అర్జంటుగా ప్రపంచ భాషగా చేసెయ్యడం, చారిత్రాత్మక స్థలాలని పరిరక్షించుకోడం..ఒకటేమిటీ...అతిశయోక్తులకే అతిశయోక్తిగా ఎవరో కవులు ఏకంగా తొమ్మిది ఉన్నతాశయాలు రచించి తమ సృజనాత్మకతని నిరూపించుకున్నారు. అన్నింటికంటే పెద్ద్ద జోకు పాలన, బోధన, మాధ్యమాల భాషగా తెలుగుని వాడడం ఈ మహా సభల ఆశయాలలో ఒకటి. ఇది చదవగానే ఆయనే ఉంటే మంగలి ఎందుకు అనే సామెత జ్ఞాపకం వచ్చింది. మింగ మెతుకు లేదు, మీసాలకు సంపెంగ నూనె సామెత కూడా ఇక్కడ అన్వయిస్తుంది. పైగా పాఠశాలలో తెలుగు నేర్పకుండా ముప్ఫై ఏళ్ళు నిద్ర పోయి, ఈ మహాసభలకి మూడు వారాల ముందు కాలేజీల్లో కూడా తెలుగు ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందీ అని విద్యాశాఖాధికారిగారెవరో ఇంగ్లీషులో చేసిన ప్రకటన చూసి నాకు ఏడవ లేక నవ్వొచ్చింది.

ఇలాంటి రాజకీయ ప్రాధాన్యత ఉన్న మహా సభలకి అమెరికాలో కూడా ప్రతీ ఏడూ మూడు రోజుల సభలు చేసేసి తెలుగు సంస్కృతిని పెంపొందిస్తున్న అగ్ర వర్ణ సంఘాల పెద్దలనే పిలుస్తారు కదా అని, మనం ఎలాగూ ఆటలో అరటిపండే కదా అని నాకు మెల్లి, మెల్లిగా జ్ఞానోదయం అయింది. సరేలే, ఏంచేస్తాం, వస్తానంటే వద్దనరుగా అనుకుని మహా సభలకి రిజిస్టర్ చేసుకోడానికి ఆ వెబ్ సైట్ లో ఉన్న నమోదు పత్రం డౌన్ లోడ్ చేసుకున్నాను. యధాప్రకారం నమోదు రుసుము ఇండియా వాళ్ళకి ఐదు వందల రూపాయలే కాని, ఎన్నారై లు మటుకు అంతకి రెట్టింపు కట్టాలి. అదీ డాలర్లలో మాత్రమే. పైగా కాఫీ, టీలతో సహా అన్ని ఖర్చులూ మావే. అంటే విమానం టిక్కెట్టుతో కలుపుకుని సుమారు ఐదు వేల డాలర్లన మాట. మా క్వీన్ విక్టోరియాకి తెలిస్తే "మహా సభలకి హాజరౌదామనుకున్న భర్తను చావగొట్టబోయిన హ్యూస్టన్ వనిత" అని పేపర్లలో పడుతుంది అని తెలిసినా, నా వివరాలు ఆ నమోదు పత్రంలో పూర్తి చేసి, క్రెడిట్ కార్డ్ తో డబ్బు కట్టడానికి ఈ-సేవ ఆన్-లైన్ క్లిక్ చేశాను. వెంటనే అది ఆకాశంలో ఎక్కడికో వెళ్ళి పోయి

మళ్ళీ వెనక్కి రాలేదు. ఇలా నాలుగైదు సార్లు తంటాలు పడి, ఇక లాభం లేదు అనుకుని వెబ్ సైట్ లో ఇచ్చిన రెండు ఈమైల్ అడ్రస్ లకీ "ఇప్పుడేం చెయ్యాలీ?" అని ప్రశ్నిస్తూ, సమాధానం ఆశించకుండానే ఉత్తరం పంపించాను. ఇది జరిగిన నాలుగు రోజులకి అక్షరాలా నా పేరిట "ఎక్కడో దాక్కున్న సాంస్కృతిక శాఖ" వారి సెక్రటరీ దగ్గర నుండి ప్రత్యేక ఆహ్వానం వచ్చింది. అమ్మయ్య, ఇక వెబ్ లో నా నమోదు ఆకాశం లోనే ఉండి పోయినా పరవాలేదు, ఈ కాగితం పట్టుకుని వెళ్ళ వచ్చును అనుకుంటూ, ఇది ప్రింట్ చేసి పటం కట్టించుందాం అని ఆశ పడుతూ ఆ ఆహ్వానం పూర్తిగా చదవగానే విషయం తెలిసిపోయింది. అందులో కూడా "ఈ వ్యక్తిగత ఆత్మీయ ఆహ్వానాన్ని మన్నించి మీరు తక్షణం మా వెబ్ సైట్ కి వెళ్ళి నమోదు చేసుకోండి. అన్ని ఖర్చులూ మీరే పెట్టుకోవాలని మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నాం" అని మళ్ళీ నా బెలూన్ లో గాలి తీశేశాడు ఈ ఐ.యే.యస్. గారు కూడా. అది చదివి, నిట్టూరుస్తూ, అది పటం కట్టించుకునే ఆలోచన విరమించుకున్నాను ఆ డబ్బు కూడా దండగ ఎందుకూ అనుకుని. కానీ "మీ సైట్ లో క్రెడిట్ కార్డ్ తో రుసుము చెల్లించే లింక్ పనిచెయ్యడం లేదు. మరి రిజిస్ట్రర్ చేసుకోవడం ఎలాగా?" అని సలహా అడుగుతూ ఆ నిర్వాహకుడు నెంబర్ టూ గారికి ఒక మెయిల్ ఇచ్చాను. ప్రపంచంలో మరొక వింతగా సరిగ్గా మూడు రోజుల తరవాత కంప్యూటర్ లో ఒక ఈ మెయిల్ వచ్చినట్టు గంట మోగగానే అది ఓపెన్ చేశాను. అది రెండో నెంబర్ నిర్వాహకుడి గారి దగ్గర నుండి నాకు వచ్చిన సమాధానం. "మా వెబ్ సైట్ లో ఇండియా క్రెడిట్ కార్డ్ మాత్రమే తీసుకుంటాం. అమెరికా వాళ్ళు ఇక్కడికి వచ్చి, ఏ ఈ-సేవా కేంద్రంలో అయినా ఇరవై డాలర్లకి ఆ రోజు రేటు ప్రకారం రూపాయల్లో కట్టాలి. డాలర్లలోనే కడదాం అనుకుంటే ముందు హైదరాబాదు వచ్చి అక్కడ మేము అనుమతించిన మూడు బేంకులలో కట్టి, రైళ్ళు, విమానాలు బుక్ అయిపోయాయి కాబట్టి బస్సులో తిరుపతికి వెళ్ళాలి. మీకు కలిగిన శ్రమకి చింతిస్తున్నాం. ఈ మెయిల్ నాకు అక్షరం ముక్క వెంఠనే అర్ధం అవకపోయినా మహా సభల వారు స్వయాన ముఖ్యమంత్రి గారి నిర్వాకంలో...సారీ,,నిర్వహణలో...ఎంతో మేధో మధనం చేసి ఎన్నారై లకి ఇచ్చిన ఈ "ప్రత్యేక అ'సౌకర్యాల"కి నా ధన్యవాదాలు.

ఇక ఆ మహా సభలకి వేసిన సవాలక్ష కమిటీలలోకీ నన్ను ఆకట్టు కున్నది "జ్ఞాపికలు, బహుమతులు, సన్మానాల సంఘం". ఆ కమిటీ మెంబర్ల ఎవరో తెలీదు కానీ, అది చూడగానే అందులో మా "ఇచ్చుకో-పుచ్చుకో" భాగస్వాములు ఎవరైనా ఉన్నారేమో అని నాలో ఆశ చిగురించింది. కానీ ఇలాంటి వాటిల్లో "పుచ్చుకుంటాను - చచ్చినా ఇవ్వను" బాపతే ఉంటారు కదా అని నా విషయ సేకరణలో తెలిసిపోయింది కాబట్టి, ముచ్చటగా మూడో సారి నా మహా సభల బెలూన్ లో గాలి మళ్ళీ పోయింది. చింత చచ్చినా పులుపు చావదు కాబట్టి ఎందుకో ఇప్పటి దాకా నాకు ఎన్ని వీరతాడులు వచ్చాయియా అని ఒక సారి మా గరాజ్ లోనూ, అటక మీదా, ఇంకెక్కడా చోటు లేక బాత్ రూం లోనూ దాచిన చెక్క ముక్కలన్నీ లెక్క వేసుకుంటే...నాకే ఆశ్చర్యం వేసింది. మొత్తం అన్నీ కలిసి ఒక్కటి తక్కువ గా నూట పదహారు తేలాయి. మరి ఆ నూట పదహారో వీర తాడు ఈ మహాసభలలో వేయించుకునే అవకాశం ఏ కోశానా లేదు కదా కించిత్తు విచారంగా ఉండగా ఫోన్ మోగింది.

మా అబ్బాయి ఫోన్ తీసుకుని "డాడీ, ఇట్ ఈజ్ అమ్మా ఫ్రం ఆంధ్రా. సమ్ థింగ్ ఈజ్ రాంగ్. షి నెవర్ కాల్డ్ యు బిఫోర్" అని ఫోన్ నాకు ఇచ్చాడు.

నేను కూడా బాబోయ్ ఏం కొంప ములిగిందో అనుకుంటూ "ఏమిటి, ప్రేయసీ..అంతా కులాసాయేనా?" అని అడిగాను.

"అంతా కులాసాయే కానీ, వాటీజ్ రాంగ్ విత్యూ?" అంది ఆవేశంగా.

"నేనా, ఇప్పుడేం చేశానూ" అనబోతుండగా

"ఇక్కడ ఇండియాలో అన్ని పేపర్లలోనూ నీ పేరూ ఫొటో వచ్చాయి. నీకు ఎవరో లోక్ నాయక్ ఫౌండేషన్ వాళ్ళు అవార్డు ఇస్తున్నారుట వైజాగ్ లో. నాకు చెప్ప లేదేం. హన్నా" అని మా క్వీన్ విక్టోరియా కసిరింది.

"ఏమో నాకేం తెలుసూ...: అని బుర్ర గోక్కుంటూ "ఆహా...ఏమి నా జాతకం...మొత్తానికి "మహా వీరతాడు నెంబర్ నూట పదహారు" వేయించేసుకుంటున్నాం అని అప్పుడే మొలిచిన కొమ్ములు నాజూగ్గా తడుముకుంటూ నాకు అసలు ఎవరైనా ఎవార్డులు ఎందుకు ఇస్తారో తెలియక సిగ్గు పడ్డాను.

●●●

COMMENTS